కథానిక

# కాలసర్పయోగంలో సావిత్రి

"రమణశ్రీ"

నాగరాజు బయటికి వెళ్ళిపోతూ, సావిత్రి ముఖంలోకి, సుదీర్ఘతని సూక్ష్మీకరించి చూస్తూ అదోలా నవ్వేడు. నవ్వును అర్థం చేసుకుని మింగుతూ కంఠంలో అదిమిపట్టుకొని నవ్వలేక నాగరాజుని భయంభయంగా చూస్తూ నవ్వింది. ఆ నవ్వుల్ని వరహాలుగా మూట కట్టుకొని గుమ్మం మెట్లుదిగి వెళ్ళిపోతూన్నపుడు వీధి చివరి నీరెండ కాస్తా నల్లగా కమిలిపోతోంది. నాగరాజు వెళ్ళిపోతోన్నంతసేపూ, సందు వీధి మలుపు మళ్లేదాకా కళ్ళల్లో కళ్ళు పెట్టుకొని చూస్తూ, సావిత్రి సిమెంటు స్థంభాన్నానుకుని నిలబడిపోయింది. ఇగిరిపోతోన్న సంజ కాస్తా, సావిత్రి ఎర్రని చెక్కిళ్ళని తరిమిణిపడుతూ కాంతి సృజనతో కడగంటిపోతోంది. మెదడులో రక్తం వేడిగా ఆలోచనల త్రిప్పుల్లోంచి మరుగుతోంది.

ఎవరీ నాగరాజు? ఎందు కీవిధంగా తన జీవిత నాటకంలో మరో పాత్ర అభినయించబోతున్నాడు? ఏదోవిధంగా సాధనంగా సాగిపోతోన్న జీవితంలో ఆశల తుఫాను చెలరేగిస్తున్నాడు? అయాచితంగా తన్నాకర్షించి,హర్షించి తనలో గోడల్ని పగలగొడుతూ, రంగు రంగుల ఊహల తెరల్ని చింపుతూ, ముందుకు సాగిపోయే ప్రయత్నంలో సాహసిస్తున్నాడు?

ఈ ప్రశ్నలకి సమాధానం చెప్పుకోలేని, అసామర్థ్యపు వ్యక్తితలో దిగాలుపడి ఉక్కిరి బిక్కిరవుతోంది. తనకు అగ్నిసాక్షిగా వివాహితుడైన సంఘంలో వ్యక్తి ఒకడున్నాడు మన్మథరావు! మన్మథరావు మాట అనుకునేసరికి సావిత్రికి భయం వేసింది. తనెందుకు భయపడాలి? కట్టుబొట్లు లాంగడలచని తనాతన్నితోసి రాజనవచ్చు. మన్మథరావు మన్మథుడా? నాగరాజుని చూచిన అనంతర సౌందర్యగానంలో మన్మథరావు అపశ్రుతి! లయలేని, తాళంలేని అపశ్రుతిగా పలుకుతోన్న అతని వాగ్గానం, కర్ణకఠోర పైశాచిక భాషావికృతిని తన మనసులోకి బలవంతంగా చేదు ధారలాగ సాగుతోంది. ముఖంచూస్తే తన గులాబి పువ్వులాంటి వదనం వాడి వత్తలైపోతున్నది.

రాక్షసుడి చేతికి తన పువ్వులాంటి యౌవ్వనం ఇస్తే, రేకలు రేకలు రాలి కృళ్ళి కృశించిపోతుంది. మన్మథరావు చేతిలో నలుగుతోంది. సంఘం ఇనపచక్రాలు తన నాళనాళాన్నీ,హృచ్చకల, శకలాన్నీ కొరకుతున్నాయ్.

మన్మథరావు ఏం వ్యక్తి? అతనిలో వ్యక్తిత్వం ఎక్కడ? పెదవి విప్పి మాటాడనైనా మనసిచ్చి మాటాడడే?

పొద్దునే కాఫీ బొమ్మలోలా అందుకుంటాడు ఇంజనులోలా కడుపులో పోసుకుంటాడు.

ఒక్క తియ్యని చూపైనా చూడలేని, మంతనం మగతలో సావిత్రి ఏవగింపుగా ముఖం అటువైపు తిప్పుకుంటుంది. భోజనం, ఆఫీసు, కాగితాల రికార్డు, సాయంత్రం బీచి భోజనం ఆవలింతలు నిద్ర ఇంతే! పట్టుమని పదిమాటలన్నా మాటాడడు! మాటాడలేడో?

ఏవిషయం చెప్పినా అదోలా నవ్వు!

సావిత్రి ఆ నవ్వుని జ్ఞప్తికి నెమరువేసికొని, విషవాసన తగిలినట్టు మరణబాధ!

సావిత్రి మన్మథరావుని గురించి యోచించిన కొద్దీ చెయ్యరాని తప్పు చేస్తున్నానుకొన్నది- తను చదివినచదవంతా నిలువునా వెక్కిరిస్తున్నది. జీవితం, అనుభూతి తెలీని మనిషితో, మగనాలితో కాపురం చేస్తున్నావని!

ఆనాటి సాంఘటెనిక విషయవ్యవస్థలో పారమార్థికత తననింకా పురికొల్పుతోనేవుంది!

నాగరాజుని మన్మథరావు తీసుకొని వచ్చిన ఆరోజు సాయంత్రం తనకి బాగా జ్ఞప్తి. తన పరదా వెనకాకలనుంచి, కళ్ళలో కళ్ళు పెట్టుకుని చూచింది. అతనే! తనలో స్థానం ఆక్రమిస్తున్న

ఆతనే! రోజూ వస్తూపోతూవుండేవాడు మన్మథ రావుతో మాట్లాడి——

ఒకనాటి సాయంత్రం——

"మన్మథరావు లేడూ?"

నాగరాజు జవాబుకోసం ఎదురుచూస్తున్నాడు. మన్మథరావు లేకపోతేనేం? తనున్నదిగా! తనతో మాటాడితే! తనతో కాలక్షేపం చేస్తే! నాగరాజు మడిగట్టుకూర్చున్నాడా? వేగంగా వెనకంజ వేయగలడా?

నాగరాజు నాజూకువదనం కళ్ళల్లో కలుస్తోంది. మన్మథరావు మన్మథరావు! ఏం వ్యక్తి? అతనికి నీలాంటి స్నేహితులు కూడా ఉండడానికి అనర్హుడు!

"లేరు! రండి లోపలికి రావచ్చు"—అంటూ లోపలికి మార్గీకరించింది. మనసు రెక్కలు వేస్తోంది, స్వర్గాల కెగురుతోంది. ఆనందాన్ని తాగుతోంది.

ఎంతసేపన్నా హాయిగా, ఆ విషయం, ఈ విషయం మాట్లాడుకుంటూ కూర్చుంటే బ్రహ్మ కల్పాలు మనస్థితికి క్షణాల్పాలు! ఒకచోట దొరకని వస్తువు మరో విపణి వీధిలో దొరుకుతుంది. తనకావలసిందేమైనా వుంటే నాగరాజుదగ్గర దొరకపోదుగా! తనకావలసింది నాగరాజు దగ్గరవుంది. నాగరాజు తనకి నావికుడు, నాయకుడు!

"ఆయన పొద్దుటనగా వెడతారు-సాయంత్రం వస్తారు-వెడతారు-ఇక్కడ నిమిషం కూర్చోరు ఏంచెప్పేది?"

అలాగన్నంతసేపూ నాగరాజు సావిత్రికళ్లల్లో వెన్నెల చూచాడు వెనకాల చీకటి కాటుక పడగలా విరుస్తూనట్టు చలించాడు. ఆమె ముఖంలో కవలికాళికలు తళుకుల్ని చూస్తూ,

"కూర్చోండి! ఆకుర్చీలో కూర్చోండి"——

తనుకూర్చోని ఏదో అంది సిగ్గుతో పెదవుల్ని తడుపుకుంటూ, "మీరు చాలా సహృదయంగా మాటాడుతారులెండి. ఆయనకు మాటలురావు"

"కాస్త వయసెక్కువయ్యేకొద్దీ అంతే"

ఇలాగే మన్మథరావుని విమర్శించుకుంటూ తన సంభాషణసాగింది. నాగరాజు ప్రతిమాటలో తనకి మాధుర్యం తెరలు తెరలుగా తెరలువారుతో ఏదో అవాచ్యమైన తృప్తికి అనుభూతమైంది! నిజం గ్రహించే పెద్దమనుషుల్లేని ప్రపంచంగా భావించడం నాగరాజుపట్ల తనఅపరాధం ఎదురుగుండా నీడ పొడచూపుతోంది!

కొంతకాలం సాగాక నాగరాజు పేరిట ఒక లేఖ వ్రాసింది. అది ప్రేమలేఖగా ప్రపంచం భావించినా, జీవితలేఖగా భావించి తనచుట్టూ వున్న కట్టుబాట్లనీ, సంఘ శృంఖలాల్నీ త్రెంచుకుంటూ వ్రాసింది. ఆ లేఖలో ఒక్కొక్కగానొక్క మాట సావిత్రి జీవితాంతం జ్ఞాపకం వుంచుకోవలసి వుంటుంది. "ఎవరివల్ల సుఖశాంతులు లభించవో వాళ్ళు జీవితాంతం పతిత్వంఎలావహిస్తారు? మిమ్మల్ని కోరుతున్నాను. నాకూ, నా బతుక్కీ చక్కని బాటలు దిద్దే అవకాశభారాన్ని మీ మీద పెడుతున్నాను. ఇంతకంటే మీ నుంచి ఆశించ గలిగింది నాకేముంటుంది?"

నాగరాజు సావిత్రి మనిషే, అందునా స్త్రీయై, ఏం కోరవలసిందో, అదే వాంఛితార్థంగా అభివాంఛిందని భావించాడు. దాంతో అతని జీవితం వెంబడి, కొత్త వసంతం చిగురించి. హేమంత శిశిరదశాలు నేలరాలి ఎండి కుళ్ళిపోవటం మొదలెట్టినై. తనకిలాంటి ఏకాకిత్వంలో నుంచి ఒక స్వర్గం పుడుతోందని, కలలోనైనా గాలిమేడలు కట్టని తనకి అయాచితలభ్యం, సౌలభ్యంగా దొరికింతని భావిని నిర్విభావరీ రాత్రిగా ఊహించాడు.

మన్మథరావు స్నేహంలోంచి జనించిన పంథా వెంబడే తను, సావిత్రి హృదయాన్ని చేరగలిగేననే కృతజ్ఞతావేశం మెరుపులా మెరయబోయి, శూన్యంలో సాగిపోతోంది. మన్మథరావుని ద్రోహంచేసే, కనీసం చేయగలిగే దుశ్చర్యలు తన దగ్గిరినుంచీ, తనలో జడతత్వాన్ని నిద్రాణంలోంచి భద్రాణంగా మేలుకొలుపుతూ రంగురంగుల దృశ్యాల్ని ఉపస్సమయరేఖల్లో ప్రతిబింబింపజేస్తున్నది! తన ఆశలకి మెలిద్రిప్పి తీయని ఊపిరులందిస్తున్నది! సావిత్రినుంచే ప్రేమించడం నేర్చుకున్నాడు స్త్రీని-అందునా సావిత్రిని!

విరోధం, ద్వేషం, ఈర్ష్య తనకున్న ప్రేమని వినాశించే, మన్మథరావు ప్రయోగించే ఆయుధాలా? నాగరాజుకి నవ్వొంచ్చింది మన్మథరావుని చూచేసరికి-వ్యక్తిత్వం లేనిమనిషి! సంస్కృతి జీర్ణించుకోలేని చదువు! ఉత్తమభావ వ్యక్తీకరణ

వృషా్య తన హృదయస్వాతంత్ర్యాన్ని రూఢించే సావిత్రిని, ఏ విధంగానూ దరికి చేరలేదు. తనకను గుణంగా విడాకులిస్తే, తన జీవిత జీవత్కాలానికి నీడకాకుండా పీడ వదిలిపోతే?

## 2

సావిత్రి ఆలోచిస్తున్నదల్లా ఏడుగంటలు కొట్టే సరికి, మెలుకువ వచ్చినట్టు వీధిలోకి వచ్చి నించింది, అప్పటికప్పుడే వాతావరణంలో పరిణామాలు జీవితంలో సిద్ధించి వున్నయ్! ప్రకృతి క్షణం క్షణం మార్పు! తన లోలోపలదొలుస్తోన్న మార్పు! పిడుగుల్లా వర్షం కురవడానికి సిద్ధపడుతోంది. మన్మథరావు ఇంకా ఇంటికి రాలేదు.

అతనిలో తను అప్పుడప్పుడు యథాలాపంగా గుర్తిస్తున్న మార్పుల్లో ఇదొకటి వేళకి సరిగా యింటికి రాకపోవడం. —అసలు ఇదివరకుండే పదినిమిషాల్లో ఒక నిమిషమే యింట్లో ఉండేందుకు వినియోగించడం—

కాలం దాటింది! వర్షం కురుస్తోంది! మేఘాలు గర్జిస్తున్నయ్! ఆకాశమంతా అరణ్యరోదన! ఆ రాత్రి రాత్రంతా మన్మథరావుకోసం కళ్లల్లో వెదికింది. వచ్చే జాడల్లేవు-వచ్చిన జాడలసలు లేనేలేవు. ఎప్పుడు నిద్రవచ్చిందో అలాగే, పక్కమీద పడుకుని నిద్రపోయింది. నిద్రలో ఏవిధమైనా పీడకలా రాలేదు.

ఆకాశంలో మేఘాలన్నీ నరికివేసినట్టు కుప్పలుగా పడివున్నాయి చీదరగా, ఈదరగాలి వీస్తోంది! ఒంటరి ఓడని తన్నిలా వదిలేసి ఎక్కడికి పోయాడు? ఎందుకు వెళ్ళిపోయాడు చెప్పకండా?

అతను రాలేదనే, దుఃఖావేశం కింకర్తవ్యతా వైమూఢ్యంలో అంతూ దరీలేని, ఏ ఎడారి దారిలోనో, పరుగెత్తుతోంది తను తనతని యెడల చేసిన అపరాధాన్ని చెప్పకండా ఎందుకు వెళ్ళాడు? ఇక రాడా?

ఇక రాడనే నిర్ధారణకి మన్మథరావు నిగూఢంగా వ్రాసిన ఉత్తరమే ఉత్తర సాక్ష్యమిస్తోంది.

సావిత్రీ,

నీ ఆవేదన నా కర్థమైంది. నేను నీకు భర్తగా వుండి, ఏదైనా మహోపకారం చెయ్యగలిగితే అది ఇది ఒక్కటే! నువ్వు సుఖించలేవు, నీ సుఖం నేను పాడుచెయ్యను. నీ ఆనందాలకీ, అందాలకీ ఆశలకీ ఆశయాలకీ అడ్డురారాదనే త్యాగం చేస్తున్నాను. నిన్నూ నీ యింటినీ నేను విడిచి వెళ్ళిపోతున్నా! నే నెవరిలో కలిస్తేనేం? నాకు ఆత్మ కావాలి! ఆత్మీయత కావాలి! ఆధ్యాత్మికత కావాలి! నేను ఒక ప్రేమించిన స్త్రీకిగాని, మరెవరికీగాని ఏవిధంగానూ ఉపయోగించననే వెళ్ళిపోతున్నా. నువ్వు దాచినా దాగని సత్యాన్ని నేను దాక్కొని చూచాననే అపరాధం నాదికాని నీదికాదు. నాగరాజుతో నీ సామ్యాలకీ, సామరస్యాలకీ అభిరుచులకీ తగినవాణ్ణిగా ఎన్నుకొనే, అతనితో నీ జీవిత మాధుర్యాన్ని తాగాలనే నేను తప్పుకుంటున్నానన్నది లోకులకి తప్పుగా తోచినా నీకుగాదు! ఈ ఒక్కటీ తప్పించి నీకు చేయగలిగిందే వుంది?

నాగురించి మరచిపోయి సుఖరాత్రిలో వచ్చిన పీడకలగా త్రుళ్ళించి నీవు బ్రతుక నేర్చుకో. నీవిక నాగరాజు సాన్నిహిత్యానికి నిరాటంకవు. నా మేలుకోరి, నీ మేలుకోరిన ఈ ఉత్తరాన్ని చించివేస్తున్నంతసేపూ నీముఖ కవళికల మార్పులు ఊహించుకోకండా వున్నాను. మన్మథరావు—

ఉత్తరంలో సంగతులు కొత్తవి కాకపోయినా, పాతవే మాత్రం కాదు. సావిత్రి నవ్వడానికీ ఆశ్చర్యపోడానికీ ఆనందంతో గెంతువేయడానికీ మన్మథరావు సరిగ్గా తనతో అర్థం కాకండా లోకులనుకొనే పిరికి పందలా పారిపోయాడు కాని మన్మథరావులో ఇంత వైశాల్యం వుంటుందని గుర్తించని సావిత్రికి, ఈ ఉత్తరం మెరుపు కొట్టినట్టయింది. పట్టపగలు అంధకారమైపోయినట్టు మథనపడింది.

అతన్నే చూపులో చూచినా అర్థంకాదు. ఇక ముందుకీ అర్థం కాదేమో!

తనకీ, తను అనుకొన్న భావాలకీ అడ్డు తొలగింది స్వేచ్ఛనిలిచింది. గమ్యాన్ని చేరుకొనే ఉద్దేశంలో తను ప్రయాణసన్నాహ మౌతున్నది.

ఈ విషయం పదిమందికి తెలియడానికి, ఇరవై నాలుగు గంటలు పట్టలేదు. చుట్టుపక్కల వాళ్లకీ, చుట్టాలకీ పక్కాలకీ తండ్రికి తల్లికి అంత ప్రపంచానికి తెలిసింది. "అసమర్థుని పలాయనం" అనే శీర్షికతో అంతా ఏకధాటి విమర్శించారు. పెళ్ళాన్ని పోషించలేక, అనుభవించలేక అప్పులు తప్పులూ చేసి పారిపోయాడని. అతని నెత్తిన ఇంత

అపకీర్తి మాట నెక్కించి లోకంలోంచి అవతలికి తోలివేశారు.

సావిత్రికి మన్మథరావుని గురించిన విమర్శలు కర్ణకఠోరంగా వినిపించ సాగినై—తనకోసం తన జీవితం త్యాగం చేసిన ఒక వ్యక్తి దాగిన్న సత్యం ప్రపంచానికి వినిపించి మరింత అపహాస్యం పాలు కాదలచుకోలేదు.

ఎలా తెలుస్తుంది? మన్మథరావు వ్యక్తిత్వం వైశాల్యం? హృదయంలో మెత్తదనం? అతని లాంటి త్యాగి లేడని తను అనుకోడంలో తప్పు లేదు! అతనిలాంటి వ్యక్తి మరొకడెక్కడున్నా నమ్మడానికి వీల్లేదు-స్వార్థమానవపురుషత్వం స్త్రీ జాతిపట్ల చేసే అధర్మ కర్మానికి గొడ్డలిపెట్టుగా తనకోసం, తన సుఖశాంతులకోసం, ఆశయాల కోసం స్వకీయమైన పరువు ప్రతిష్టల్ని మంట గలుపుకొని, ఒంటరి పక్షిగా ఎగిరిపోయాడు. కాని తనకేది గమ్యం? ఏది సామ్యం? ఏదిదిక్కు—ఏది హక్కు? ఈ ప్రశ్నలకు జవాబులే తనభావి! తొంగిచూస్తో, ఆహ్వానిస్తోన్న భవిష్యత్తు!

## 3

వచ్చాడు నాగరాజు, సావిత్రిని పరామర్శించ డానికివస్తూ, "ఎంతపని చేశాడు మన్మథరావు?" అన్నాడు. "అతని బాధేమిటో వారం రోజు లిచ్చి, చూస్తున్నా ఎవరికీ అర్థమయ్యేదికాదు. లోలోపలే బాధపడేవాడు - ఎవ్వరికీ చెప్పని, ఆ అనంత ఆవేదన ఆవేశించి, ఉద్రేకించి ఇంతపనీ చేసింది."

సావిత్రి గుక్కపట్టినట్టుంది. ఎక్కడా ఊపిరి సలుపని వ్యధాహతగా నిలుచుని దిక్కులు చూస్తోంది.

"భయంలేదు సావిత్రీ! అన్నిటికీ నే నున్నా నుగా! నీ ప్రాణానికి నా ప్రాణం బలి! లోటులేని స్త్రీత్వంతో, నీ బ్రతుకు నా బ్రతుకుతోకూడా ఈడుస్తాను" అంటూ, నాగరాజు దగ్గరకొచ్చి, సావిత్రిముఖం చేతిలోకి తీసుకుంటూ కన్నీళ్ళు కారుస్తోన్న కంటిపాపల్ని దీక్షగా చూస్తూ, "నీ అమాయకమైన కళ్ళలో ఎంతబాధ మరిగింది? ఏమీ ఎరగని ఆ చెక్కిళ్ళలో ఎన్ని సంధ్యలు నర్తించుతున్నాయ్- ఈ కన్నీళ్ళను అమృతపు మున్నీళ్ళగా మార్చే అవకాశం నాది" అన్నాడు.

ఎవరైనా మిమ్మల్ని చూచే ఈ అవకాశం మీకు కల్పించడానికి, మన్మథరావు త్యాగం చేశాడు. మీతో నా ఆనందం నిరాటంకం కావడానికి తొలిగిపోయాడు. మీ అసరా చూచుకొనే ఆయన్ని అసహ్యించుకొన్నాను. ఇది ముమ్మాటికీ నిజం.

ఈ విషయాన్నే సావిత్రి వెళ్ళగక్కుతూ, తృప్తిగా నిట్టూర్చింది. నాగరాజు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ, ముఖానికి కప్పుకొని ఏడ్చింది. వెడద రొమ్ములో తల ఆన్చుకొని తృప్తిగా దుఃఖించింది.

తన కన్నీళ్ళ విలువలు గ్రహించిన నాగరాజు వక్షోపీఠంమీద విశాలంగా నిద్రపోతుంది. సుఖముగా నిద్రిస్తుంటే పీడకలలురావు. భయాలుండవు.

అంతేనా? నిజ మింతేనా?

నాగరాజు, ముంగురుల్ని సవరిస్తూ నుదుటి మీద వ్రాయబడ్డ జీవితాన్ని చదువుతున్నాడు. కళ్ళల్లో వెలుగులు కనిపిస్తున్న భవిష్యత్పథాల చీకటిబ్రతుకుల సందళ్ళని దాటుకుంటూ, వెలుగులోకాల్ని సందర్శిస్తున్నాడు.

ఇద్దరూ ఆటంకం తొలగిన నిష్కంటక వనం లోని, స్వేచ్ఛాఖవిటంకంలోకి ఎగిరే రెండు పక్షులు! రెండు రెక్కలు.

## 4

తండ్రి వచ్చి ఇంటికి తీసుకు వెళ్ళిపోతాననే నిశ్చయంలో చలించకండా, "నాకు బత కడం వచ్చు వదలిన భారాన్ని ఘోరంగా తిరిగి నెత్తిన వేసుకోకండి. నన్నిలా వదిలివేయండి నాకూ ఎవరో ఒకరున్నారు" అంది.

తండ్రి నోరు మెదపలేదు. ఇతనితో పెళ్ళి వద్దని, ఆనాడే మొరపెట్టిన సావిత్రి మాట విన లేక దాని జీవితాన్ని నిలువు నాకోశానే! అనే కోత తన హృదయ కోశాన్ని కోస్తోవుంది, "మన్మథరావులో ఇంత నీరసత్వం ఉందనుకోలేదు వ్యక్తిలో వంచన ఊహించలేని గభీరత్వం సుమా సావిత్రీ-నీ గొంతుకోసినా, చేసినా రాకతప్పదు. ఒంటరిగా ఎలా బతుకుతావు?" అన్న తండ్రి ఎదురు ప్రశ్నకి సమాధానంగా,

"నాకు బతకడంవచ్చు" అనే వాక్యంతో కొట్టి పారవేసింది.

తండ్రికి ఆ మాటే పదిసార్లు వినిపించింది.

కర్ణకఠోరంగా అనిపించింది.

కన్నకూతురు ఎంత లోకువైంది కాకపోతే అలా అంటుంది?

ఇకనిలవకుండా వెళ్లిపోతూ 'జాగ్రత్త' అన్నాడు "జాగ్రత్త" అనే పదాక్షరాల్ని మనసులో దిద్దుకుంటూ, సావిత్రి నవ్వుకుంది.

తల్లి వచ్చి రమ్మని బతిమిలాడింది.

"పెళ్ళి చేసేంతవరకే మీదాన్ని ఒక తాడుతో గుంజకి కట్టివేసిదప పశువునిగురించి, మీరాలోచించ నక్కరలేదు. గుంజవిరిగినా, తాడు తెగినా ఊడినా మరొకరు కట్టగలరు. ఎలాగైనా సర్వస్వతంత్రను ఇంటికిరాను, రాలేను నా విషయం మీ రాలోచించవలసింది కాదు"——

అని సాగనంపింది. ఎవరొచ్చినా తనన్నింటినీ ఎదిరించి నిలిచింది. ఒకపని ఒక మంచికి రాకపోదు.

నాగరాజు ఒక శుభముహూర్తంలో, రిజిష్టరు వివాహం చేసుకోడానికి సిద్ధపడ్డాడు. సావిత్రి సంకోచంతో అతనికి నిమిత్తంలేకుండా, పూలమాలలు వేసుకొని ఫోటోలు తీయించి పత్రికాముఖంగా ప్రకటించాడు. ఆ ప్రకటనే, తమభావి జీవితానికి సాక్షి! ఇవన్నీ ఎందుకని? సావిత్రి ఎదురుప్రశ్న వేయగలిగినా తనలోని బలహీనత అడగలేకపోయింది.

సావిత్రికి నాగరాజుతో జీవితం రుచిగానే కనిపించసాగింది. సినిమాలు, షికార్లు వెన్నెల విహారాలు తనని పులకించినై. తను ఆశించిన, సౌఖ్య సఖ్యతలకి తనలో కావ్యంలేకుండా, సమృద్ధిగా లభిస్తున్నాయనే తృప్తి మనసులో ఎక్కడో ఒకేమారుమూలనుంచి మెరియసాగింది.

నాగరాజు, పెద్దఉద్యోగస్థుడు కాకపోయినా, సాధారణ ఉద్యోగి. నూరు రూపాయల ఆదాయంతో ఉన్నదంతా, ఉత్సాహంగా ఖర్చుపెట్టుకుంటూ సాగుతున్నారు. సావిత్రికి, రోజుకూ కొత్తజాకెట్టు, ఒక కొత్తచీర, కట్టుకోనేటంత బట్ట విలువుంది. వచ్చేనెల జీతంలో, సావిత్రి కొంత కొత్త గుడ్డలకీ మినహాయించేది. తనెంతచెప్పినతే అంత అనే నాగరాజు వుండడం సావిత్రికి మరింత ఉత్సాహం రేకెత్తించింది.

ఒకనాడు తన చేతిలో కాఫీ అందుకుని తాగుతూ, "మధ్య విషం కలిపిచ్చినా, వెచ్చగా కమ్మగా అమృతం తాగినట్టు తాగుతాను." అంటాడు.

ఇలాంటిమాటల పోకడకంటే స్త్రీ వాంఛించే సాహిత్య మేంవుంటుంది? నాగరాజు ఒక్కొక్కపుడు తన శిల్పానికి ముగ్ధుడై, తన్మయత్వంలో తేలిపోయేవాడు. తనచీర కొంగు అంచుల్లో తన శరీరాన్ని దాచుకొని సోలిపోయేవాడు. పొంగే యౌవ్వనపు పొంగుల్ని పాలనురుగుతాగే లేగ దూడలా తాగి, తాగి మత్తెక్కి ఆనందలోకాల్ని సృష్టించుకునేవాడు.

తనుకూడా, అతనిలో ఇటువంటి అనుభూతి పొందగలిగేది.

కాలం భవిష్యత్తుని మింగుకుంటూ పోతోంది. సావిత్రి నాగరాజుల కాపురం నీటిమీద పడవ సాగినట్టు సాఫీగా సాగిపోతోంది. ఒక రెండు సంవత్సరాల దాటకుండానే సావిత్రి కడుపుపండి, ఆడపిల్లని కన్నది. అరుణ అని నామకరణంచేశారు.

పిల్లని కనడంతోనే సావిత్రికి మళ్ళీ స్త్రీత్వం అంటే గుర్తుకి రాసాగింది. పిల్లనిపెంచే ప్రయోగాల్లో తను చూపించే లోపాలు నాగరాజు నోట్లోపడి అపహాస్యంగా మారి బయలు వెడలుతున్నాయ్. తను ఒంటరిగత్తె! పిల్లని సాకడంలో ప్రాణాలు తెగిపోతున్నాయ్. పిల్లకి ఉగ్గుగిగ్గూ, పాలూ అవీ పట్టడంనుంచి కాటుకపెట్టి సాంబ్రాణి పొగవేసి, తీర్చేసరికి తనలో సహనం నశించిపోయేది. ఇదివరకటి ఉత్సాహం తనలో నిండుకుంటూన్నందుకు సావిత్రికి బాధ కలిగింది. నెలకో గ్లాక్సో పాలడబ్బాతో పిల్లకర్చుకే పదిపదిహేను కావలసి వచ్చినందుకు, నాగరాజు తిన్నగా వున్నవాళ్లు పూరుకోక ఈ బెడద నెత్తినెందుకు తెచ్చి పెట్టుకున్నానురా అని దేవురించాడు. రోతా, రోగాలతో పిల్ల కనుమూస్తే జబ్బు, తనచేతిలో, డబ్బు- ఊడిపోవడంగా—— ఆర్నెలలుగా ఆర్థికంగా యమయాతన పడుతున్నాడు.

తన ఉద్యోగం వుండబట్టి సరిపోయింది. ఇదే లేకపోతే! తను మన్మథరావుకంటే గొప్పవాడా?

ఒకరోజున "అరుణ ఎలావుంది సావిత్రీ?" అన్నాడు నాగరాజు.

ఉయ్యాలలో ఆడుకుంటూన్న బిడ్డని తీసి, ఆడిస్తూ నాగరాజు చేతి కందిచ్చింది.

రెండు సంవత్సరాలు నిండుతోన్న అరుణ "అమ్మా నాన్నా" అంటూ మాటలు నేర్చుకుంటోంది.

"మన్మథకళలే" అన్నాడు నాగరాజు.

సావిత్రికి మన్మథ శబ్దం, మెరుపు కొట్టినట్టు వినిపించింది.

"చూడు అరుణా! నీకు అమ్మెక్కువా? నాన్నెక్కువా?" నాగరాజు పాపని కిలకిల నవ్విస్తూ అడిగాడు.

"అమ్మ అమ్మ" అని రెండుసార్లంది అరుణ.

"చూశావా? జాతిలక్షణం పోనిచ్చుకుందేమో నువ్వే ముఖ్యంగాని, నేనుగాను. కృతఘ్నత ఆడవాళ్ల ఆభరణాల్లో ఒకటి-ఏమైనా పెద్దదయాక నీలాంటిది కాదులే"

మన్మథరావుని తను మర్చిపోయింది. కృతఘ్నురాలు! అతను ఆనందంగా ఆశీర్వదిస్తూ, నీ శాంతికీ సుఖానికీ అడ్డురాను అంటూ దీవించి వెళ్ళిపోయాడు. అతను ప్రపంచానికి దీవనలు, ఆశీర్వాదాలు ఇవ్వగలిగేటంత విశాల హృదయుడు!

నాగరాజు రెట్టిస్తూ, "నా అరుణ నీలాంటిది మాత్రం కాదులే!" అన్నిమాటలు చెవుల్ని గింగుర్లెత్తించినయ్! తన అంశలోంచి పుట్టింది తనలాంటిది కాదట! అతని వ్యంగ్యానికి సమాధానం చెప్పుకోలేనంత దుర్బలక్షణాలు తనవి! ఆ రోజు నుండి తనలో ఏదో నలత ప్రవేశించి, రెండు పూటల్లో జ్వరం తెప్పించింది. పిల్లని పక్కలో పెట్టుకొని జ్వరంతో మూలుగుతూ వుంటే నాగరాజు గాభరా పడుతూ, "నీకేం రోగంరాలేదు కదా!" అన్నాడు.

ఉమ్మి వూస్తూ, నీరసంగా అంది, "జ్వరం వస్తోన్నట్టుంది." వంటి వేడిని, చెంపల మేదా, కడుపుమీదా గ్రహిస్తూ, "నిద్రలేక, వేళకు తిండి తినక, ఏవో మనసులో వెధవాలోచనలూ—వేడి చేసి జ్వరం" అన్నాడు.

ఆ మాటలు వింటూ, నాగరాజు ముఖంలోకి ధైర్యంచేసి చూడలేకపోయింది.

సావిత్రి శరీరానికి గళ్ళదుప్పటి కప్పుతూ, అరుణని వేరే పడుకోబెట్టి, జ్వరానికి సిబ్జాల్ పిల్స్ వేశాడు.

"ఎవరినన్నా యీ నాల్గురోజులూ పిలవమన్నావా? మీ అమ్మనిగాని..."

నాగరాజు నోరుమూస్తూ, "ఎవరికీ ఉత్తరాలు రాయడంగాని. పిలవడంగాని చెయ్యకండి! మీకు పుణ్యముంటుంది. వచ్చిన జ్వరం వచ్చినట్టే పోతుంది" అంది సావిత్రి.

భవిష్యత్తంతా గాంధాంధకారంగానూ అనుకున్నట్టూ లేదనీ వ్యథ పడసాగాడు నాగరాజు. అనవసరంగా కలుగజేసుకుని, సంసారకూపంలో ఊబిలో దిగబడ్డాడు. దిగాక తప్పించుకుపోయే పద్ధతియాక, మరింత అపయశంపాలై, నలుగుర్లో నలిగిపోతాడు. ఇటు సావిత్రినీ కూలదోసి, తనూ కూలిపోతాడు. ఎలాగైనా, కడముట్టాలి. ప్రతి మానవుడి జీవితం వెలుగూచీకటీ, ఉదయం సంధ్య, తెలుపూనలుపూ లాంటివి కాకపోతే అంతా ఎలా బతకనేరుస్తారు!

నాటి సాయంసంధ్యలో సావిత్రి పడిన జబ్బు, అప్పుడప్పుడు పొడసూపసాగింది. కాని నాగరాజుకి బాధ తెలియనిచ్చేదికాదు. అలాగే కిందా మీదా పడుతూ గెంటుకొచ్చేది.

పరిస్థితులకి నాగరాజులొంగక తప్పిందికాదు. ఒక నాలుగేళ్ళ క్రితం తను ఏకాకి-ఆ వంటరితనం నుంచి తప్పించుకుని సావిత్రితో రెండయాడు. మరో ఏడాదికి అరుణతో మూడయాడు. తన జీతంలోమాత్రం కానీ మార్పులేదు. జీతం-జీవితం ఈ రెండూ ఎంత దగ్గరిపదాలు! ఈ జీతంతోనే జీవితం గడుపాలని భగవంతు డేనాడో, తన లాంటి ఉద్యోగులు ముఖాలమీద రాసిపెట్టాడు. సావిత్రి మరోబిడ్డని కనబోతున్నదేమో! అనుమానానికి తనలో తావిస్తోంది.

పరిస్థితుల ఒత్తిడినుంచి తప్పించుకోడానికి, అప్పుచెయ్యక తప్పిందికాదు. ఆ అప్పు అలా నాలుగుసార్లు చేశాడు నాలుగువందలై పెరిగి వడ్డీ పిల్లలతో అయిదువందలవుతానంటోంది. సావిత్రి యిల్లు తప్పించి, మరో ఆస్తి ఏదీలేదని అందరికీ తెలుసు. ఆ యింటో ఇప్పుడు తాముండనే వుంటున్నారు. ఇది లేకపోతే వేరే దిక్కెక్కణ్ణుంచి వస్తుంది?

"నీలో రోగం రోజురోజుకి మితి మీరుతోంది. నువ్వు నీరసరంగా సగంగా తయారవుతున్నావ్, నిన్ను గానా బతికించలేకపోతే నేనెందుకూ పనికిరానీ దరిద్రుణ్ణి" నాగరాజు ఆవేశాన్ని అపుతూ, "మీరెప్పుడూ అలా అన

కండి! నా ఆరోగ్యానికేం బాగానే వుంది. ఉన్న దానితో కడుపు నిండుకుంటె చెయ్యగలిగిందేం లేదు" అంది సావిత్రి. నాగరాజు అసమర్థుని ముఖం పెడుతూ ఎలాగైనా ఈదడం కష్టం అను కున్నాడు. దరిద్రం అన్ని విధాలా అతన్ని సూది పోట్లు పొడవసాగింది.

## 5

పదిహేను సంవత్సరాలకి, సావిత్రీ తనూ కలిసి కాపురం చేస్తున్న పదిహేను సంవత్సరాలకి ఒకనాటి సాయంత్రం సావిత్రి లోపల ఎవరి తోనో మాట్లాడుతోంది నాగరాజు గుమ్మం మెట్లెక్కుతూ, ఆవ్యక్తి ఎవరు? ఎందుకొచ్చాడు. అనే తొందర ప్రశ్నల్లోంచి కొట్టుకుంటూ, లోప లికి వెళ్ళాడు. నాగరాజుని, చూచి తప్పుకుంటూ "వస్తా సావిత్రీ! వెళ్ళొస్తాను" అంటూ గబగబ మెట్లుదిగి వెళ్లిపోయాడు. కొత్తమనిషి! సన్య సించిన వస్త్రాలు ధరించి గెడ్డం మీసాలు పెంచు కొని, జీవితరక్తిని, విరక్తిగా మార్చుకున్నవాడు! ఎవరీవ్యక్తి?

"ఎవరీయన?"

"ఎవరో నాకు తెలీదండీ ఆయనంత టాయనే వచ్చి మీకు దూరబంధువుని ఇలా సన్యాసం పుచ్చుకుని, దేశాలు తిరుగుతున్నాను, మన్మథ రావు లేడా? అతను నా "పినతండ్రికొడుకు" అంటాడు ఇంతలోకే మీరూ వచ్చారు."

నాగరాజు నవ్వుతూ, "జీవితాన్ని వదిలేసి పరారీ అయిపోయిన తమ్ముణ్ణి పరామర్శిద్దామను కొని వచ్చాడు గాబోలు" అన్నాడు.

ఆ నవ్వు సావిత్రిలో అడ్డుగోడల్ని ఫెళఫెళ పడగొడుతూ పెద్దధూళి లేవదీసింది. మన్మథ రావునిగురించి వ్యంగంగా అనే ముక్కలు, తన గుండెల్ని ముక్కలు చేస్తున్నయ్.

నూతనంగా ఆ వూరికి వచ్చిన, ఆ సాధువు పేరు శివానంద భారతి! తిన్నగా సావిత్రి దగ్గర కొచ్చి మన్మథరావుని గురించి, అడిగి వెళ్లిపో యాడు. నలుగురైదుగుర్ని అతన్ని గురించి అడు గుతూ, ఎందుకు వెళ్ళిపోయిందీ? చెప్తున్నాడు. అతని చెవులు గింగురులెత్తిపోయాయి. అందరూ మన్మథరావుని తిడుతూ, అసమర్థుడై భార్య రంభ లాంటి సావిత్రితో మసుగడ గడుపలేక పిరికి పందలా పారిపోయాడు. సన్యాసుల్లో కలిసి పోయాడో, బైరాగుల్లో కలిసిపోయాడో? అని ప్రతివిమర్శిస్తుంటే, శివానందభారతి కళ్లుతుడుచు కొనేవాడు.

"మీకు బంధువా?" అని అడిగితే, "అవు" ననే జవాబు చెప్పేవాడు. "సీతారామాంజనేయా శ్రమం"లో తన మకాం పెట్టుకొని కొంతకాలం అక్కడే వుండిపోయాడు. అతనిచే ప్రజలు చాల మంది ఆకర్షింపబడ్డారు. వారానికీ నాలుగైదు సార్లు ప్రజల్ని ఆహ్వానించి, ఆధ్యాత్మికోపన్యా సాలు అనర్గళ ధారాప్రవాహంగా ఇచ్చేవాడు. ఆ ఉపన్యాసధోరణికి, పలుకుబడికీ ముగ్ధులు కాని మానవులు లేరు! సంసార సాగరంలో మానవుడి కష్టాల్ని కళ్ళకి కట్టినట్టు చిత్రిస్తూ ఉపన్యసించే వాడు. ఆ ఉపన్యాసంలో ప్రజలు అలల్లో తేలి పోయేవారు. సావిత్రి ఈ విషయం తెలుసుకొని ఒకనాడు వెళ్ళింది ఉపన్యాసం వినడానికి. వందలు వేలూ జనం కిటకిటలాడిపోతున్నారు. శివానంద భారతి తడుముకోకుండా, మధ్యమధ్య హాస్యం పూతపూస్తూ. మానవునిపట్ల 'కృతజ్ఞత-కృతఘ్నత' ఎలా పరిణమిస్తుందో వివరించసాగాడు. త్యాగం చేసిన మానవుణ్ణి, ప్రపంచం ఏ దృష్టితో గ్రహిం చేది-ధారాప్రవాహంగా ఉపన్యాసజలపాతాన్ని ప్రజానీకం మీద వదలుతున్నాడు. సావిత్రి ఆ జలపాత వేగానికి తట్టుకోలేకపోయింది. ఈ ఉప న్యాసంలో ప్రతిముక్క తనని గురించే చెపుతో న్నట్టు వింది.

శివానందభారతి ప్రత్యుపన్యాస వాక్కు లోనూ మన్మథరావు తాండవించాడు. అతనే తనని దెప్పి పొడుస్తున్నాడు. కృతఘ్నురాలనీ, నీచురా లనీ, పాపాత్మురాలనీ. ఉపన్యాసం వినలేకపో యింది. ఒక్కపదం కూడా తనచెవిలో కెక్కడం లేదు.

శివానంద భారతి ప్రతివాక్కులో మన్మథ రావు మనోజ్ఞ ధోరణి! ఆ చేతులు త్రిప్పడం వూపడం దగ్గర్నుంచీ, స్మృతిలోకాలలో మన్మథ రావు తాండవిస్తున్నాడు. మన్మథరావు, శివానంద భారతిలా రూపు దాల్చి, తనమీద పగసాధించు కోటానికి రాలేదు గదా! తను చేసిన కృతఘ్నతకి శపించిపారవేయడు గదా!

ఇకనిమిషమైనా, నిలువలేక పోయింది— జనాన్ని తోసుకుంటూ ఆశ్రమంలోంచి, నిష్క

మించింది కాలు కదులుతూన్నంతసేపూ, శివానందభారతి తన వెనకచూస్తూ, ఉపన్యాసం చెబుతూన్నట్టి అనుకుంది. ప్రజల్లో చెలరేగుతోన్న నవ్వు తన్నుచూసి, నవ్వుతోన్నట్టే బాధపడింది. వెళ్లిపోతున్న వారిని వెళ్లిపోవద్దని, హెచ్చరిస్తోన్న కేకల్లో, తనని పురస్కరించుకొనికూడా వుంది. ఐనా, తాను వెళ్లిపోవాలి. ఎక్కడికైనా పారిపోవాలి! అతనున్నంతసేపూ, తనలో అశాంతి, తను చస్తేనేగాని, అశాంతి చావదు!

తిరిగి, వెళ్లిపోయినవాడు ఎందుకొచ్చాడు? సాక్షీగా జరిగిపోతూన్న తనకుటుంబ వాతావరణంలో హృదయాంగణంలో తుఫాన్లు చెలరేగదీయడానికి? ఎందుకొచ్చాడు? తన కృతఘ్నతకి తననిచంపి, హృదయంలో పొంగుతోన్న వెచ్చని రక్తం దోసిళ్ళకొద్దీ తాగడానికా?

పరుగెత్తుకుంటూ, యింటికి వచ్చింది. ఎంత త్వరగా నడిచిందో తనకే తెలీదు! గాలికి ఊగులాడిపోతున్న ఉపన్యాస జలపాతధారలకి వణికిపోతోన్న తన శరీరాన్ని ఇంటోకి చేరవేసింది.

తొమ్మిది కావచ్చు, పది కావచ్చు——

నాగరాజు, బెడద, బెంగలేకండా నిద్ర పోతున్నాడు. మెల్లిగాలేసింది. నాగరాజు లేచి, "ఏం ఉపన్యాసం అయిపోయిందా?" అన్నాడు——

సావిత్రి వణికిపోతో "శివానంద భారతికాడతను. మన్మథరావు" అంది.

నాగరాజు త్రుళ్ళిపడి "అయితే అతనే నన్నమాట" అన్నాడు.

"నాకు భయంగావుంది" అంది సావిత్రి.

"భయాని కేంవుంది? వచ్చినపాము వచ్చినట్టే వెళ్ళిపోతుంది. మనమేమీ కెలక్కపోతే" అన్నాడు నాగరాజు.

తనలో ఇంత భయమెందుకు పుట్టింది? మన్మథరావు తనమీద పగపట్టి సాధించవలసిన అగత్యమేముంది? అంతా తన భ్రమ భ్రాంతి.

రాత్రల్లా ఆలోచనలతో మనస్సు మరిగిపోయింది. కళ్లు నిద్రలేక మండుతున్నాయ్.

అతను శివానందభారతి వస్తున్నాడు.

వికవికలాడుకుంటూ, పకపకనవ్వుకుంటూ——

"నేను నా జీవితాన్ని నీకు త్యాగంచేశాను! నువ్వు నాకేం చేశావు? నీవు కృతఘ్నురాలివి. కృతఘ్నతాశీలివి. నిన్ను రక్తంలో ముంచెత్తుతాను" భయంకరంగా గర్జిస్తున్నాడు. తన మీదిమీదికే వస్తున్నాడు. తన నాళ్ళన్నీ పట్టుతప్పి సళ్ళిపోయినాయ్! నిస్సహాయంగా తను కేకలేస్తోంది.

అతను మీదిమీదికొచ్చి తన స్పర్శలో, శరీరాన్ని పిడికిలితో పట్టుకుంటున్నాడు.

"అబ్బ!" అన్నబాధ ఒక్క పెద్ద మూల్గుమాత్రం వినబడుతోంది. తన రక్తంలో ఎర్రగా భయంకరంగా అరుణ సంధ్యలా...

మన్మథరావు! శివానందభారతే మన్మథరావు! వచ్చి, తుఫాన్లు, గాలి దుమారాలు చెలరేగిస్తున్న ఇంద్రజాలికుడు!

సావిత్రి కళ్లుమూసుకుంది. ఊహించే దృశ్యాలను చూడలేక——చీకటి వీడి తెల్లవారుతోన్న ఆకాశంలో ఒక అరుణ తార అదోలా ఎర్రగా మండుతోంది. సావిత్రి ఆ అరుణ తార, కిరణం లోంచి, రాలినట్టు ఆ ప్రకృతిలో ప్రపంచానికి కనిపిస్తుంది.

తెల్లటి కన్నీటి బిందువులు, నక్షత్ర కిరణ కళలాలుగా ఆమె కళ్ళనుంచి రాలుతున్నాయి.

చిన్నపిల్లలకి మనం చెప్పే కట్టుకథల ప్రయోజనం ఒక్క జీవితసత్యం రుజువు చేయడం కోసమే: మానవుడు తన "విధి"ని తన చేతుల్లోకి తీసుకుని కృషిచేస్తే, అభూత కల్పనలుగా కనబడే అనేకం వాస్తవిక రూపం దాలుస్తాయి. అంతటితో పర్వతాలు కదల్చేస్తాం, నీరు పల్లంనుండి ఎత్తుకి పంపిస్తాం, ఫలవృక్షాలు రకరకాల పళ్లు కాస్తాయి, భూమాత రత్నగర్భ అయి మానవానీకం అందరికీ నివాసయోగ్యంగా హాయిగా తయారవుతుంది.——(ఒక చెకోస్లవేకియా పత్రిక)